నమస్తే తెలంగాణ

మహబూబ్‌నగర్

నారాయణపేట

5 | మహబూబ్‌నగర్, బుధవారం 22 మే 2024 | MAHABUBNAGAR NARAYANPET




నల్లమల అటవీ ప్రాంతం

# ఏటీఆర్‌లో వన్యప్రాణుల గణన

- మూడ్రోజులపాటు కొనసాగనున్న శాఖాహార జంతువుల సర్వే
- 103 మంది అధికారులు, సిబ్బందికి ఇప్పటికే శిక్షణ
- ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు లెక్కింపు



సర్వేచేప డుతున్నఅట వీశా ఖ సిబ్బంది

అచ్చంపేట, మే 21 : దేశంలో రెండో అతిపెద్దదైన అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ఏటీఆర్) అటవీ ప్రాంతం జీవవైవిధ్యాన్ని కలిగిఉన్నది. నల్లమల అటవీ ప్రాంతం విభిన్న రకాల జంతుజాలానికి నిలయం. ఇది ముఖ్యమైన జీవవైవిధ్య జోన్‌గా మారింది. ఆకురాల్చే అడవులు, గడ్డి భూములు కలిగి ఉన్నది. టేకు, రోజ్‌వుడ్, వెదురు, గూస్‌బెర్రీ, కినో చెట్లు అధికంగా ఉంటాయి. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ చుట్టూ ఎత్తైన కొండలు, లోయలు, కృష్ణానది, జనసంచారానికి అవకాశాలు అంతగా లేకపోవడంతోపాటు బఫర్‌జోన్ అధికంగా ఉండడంతో ఏటీఆర్ నల్లమల ప్రాంతం వన్యప్రాణులకు సేఫ్‌జోన్‌గా మారింది. 25 పెద్దపులులు ఉండగా.. అందులో 12 కపుల్స్ ఉన్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. వీటిలో నాలుగు పెద్ద పులులు పొరుగు రాష్ర్టాల నుంచి వచ్చినట్లు అంచనా.

***గణనీయంగా పెరిగిన శాఖాహార జంతువులు..***

అటవీశాఖ అధికారులు తీసుకుంటున్న చర్యలతో శాఖాహార జంతువుల సంఖ్య గణనీయంగా పెరిగింది. విస్తారమైన గడ్డి క్షేత్రాలు, తాగునీటి కోసం సాసర్‌పిట్లు, ఊటకుంటలు, సోలార్‌బోర్లు ఏర్పాటు చేయడం కలిసివచ్చింది. శాఖాహార జంతువులను వెంటాడి తినే చిరుతలు, పులుల సంఖ్య కూడా పెరుగుతున్నది. చుక్కల దుప్పులు, సాంబార్, నీల్‌గాయి, గడ్డిజింక, అడవిపందులు, బిట్టు ఉడతలు, కొండముచ్చులు, నక్కలు, నాలుగు కొమ్ముల జింకలు, కృష్ణజింకలు, ఎలుగుబంట్లు, దుప్పులు, మనుబోతులు, రేస్‌కుక్కలు, కొండగొర్రెలు, మూషికజింకలు, ముంగీసలు, మరునాగులు, అడవిపిల్లులు శాఖాహార జంతువుల కిందకువస్తాయి. కాగా, ఏటీఆర్ పరిధిలో ఏటా మాదిరిగానే ఈసారి కూడా అధికారులు శాఖాహార జంతువుల గణనను మంగళవారం ప్రారంభించారు. ఈ నెల 23 వరకు మూడు రోజుల పాటు సర్వే కొనసాగనున్నది. నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అఫ్ అథారిటీ న్యూఢిల్లీ ఆదేశాల మేరకు మన్ననూర్, అమ్రాబాద్, మద్దిమడుగు, దోమలపెంట రేంజ్‌ల పరిధిలోని 140 బీట్‌లలో సర్వే ప్రారంభించారు. ప్రతి బీట్‌లో ఒక స్ట్రేట్‌లైన్ ద్వారా ఇద్దరు వ్యకులు రెండు కిలోమీటర్ల మేర మొబైల్ డేటా ఫొటో షూటింగ్ సర్వే జరుపుతున్నారు. ఇందుకుగానూ 60 మంది బీట్ అధికారులు, 30 మంది శిక్షణ అధికారులు, 13 మంది నేచర్ గైడ్స్‌తోపాటు వాచర్లు, డ్రై వర్లకు శిక్షణ ఇచ్చారు. ఉదయం 6 నుంచి సాయం త్రం 6 గంటల వరకు నిర్దేశించిన ప్రాంతాలకు వెళ్లి సర్వే చేపడుతున్నారు.కనిపించిన శాఖాహార వన్యప్రాణులు, పక్షులు ఇతర వాటన్నింటిని ఫొటో తీసి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. వన్యప్రాణుల వృద్ధి కోసం చేపట్టాల్సిన చర్యలు, వనరుల కోసం సర్వే దోహదపడనున్నది. మూడ్రోజులపాటు జరిగే ఈ గణనకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు నాగర్‌కర్నూల్ డీఎఫ్‌వో రోహిత్‌గోపిడి పేర్కొన్నారు. గణన పూర్తయ్యాక వివరాలు వెల్లడిస్తామన్నారు.





అడవిలో సంచరిస్తున్న జింకలు, అడవిదున్న (ఫైల్)

# జానంపేటలో కలకలం



చనిపోయినకు క్కలకుప ంచనామాని ర్వహిస్తున్న ఎస్సై, వైద్య బృందం

- కుక్కలనుచ ంపినదుం డగులు

మూసాపేట, మే 21 : వీధి కుక్కలను గుర్తు తెలియని వ్యక్తులు చంపి పడేసిన ఘటన మండలంలోని జానంపేట గ్రామంలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. జానంపేట శివారులో హైవే-44 పక్కనున్న కాల్వలో సోమవారం రాత్రి 15 కుక్కలను చంపి పడేశారు. మంగళవారం ఉదయం అటుగా వెళ్తున్న వారు చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సుజాత ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు. జానంపేట పంచాయతీ కార్యదర్శి మాధవి ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించారు. కుక్కలను చక్రాపూర్ వైపు ఉన్న వ్యవసాయ పొలాల్లోకి తీసుకెళ్లి అడ్డాకుల వెటర్నరీ డాక్టర్ రాజేశ్ ఖన్నా సిబ్బందితో కలిసి శవ పరీక్షలు నిర్వహించారు. విషప్రయోగం చేసి కుక్కలను చంపారేమో అని అనుమానంగా ఉందని ఎస్సై తెలిపారు. కుక్కలన్నింటినీ వాహనంలోనే తీసుకొచ్చి ఉంటారని, ఈ విషయంపై విచారణ చేపడుతున్నామన్నారు. వీలైనంత త్వరగా కుక్కలను చంపిన వారిని పట్టుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

***గతంలో పొన్నకల్‌లో..***

ఫిబ్రవరి 16వ తేదీన ఇదే మండలంలోని పొన్నకల్ గ్రామానికి చుట్టపుచూపుగా వచ్చిన వ్యక్తి రాత్రి సమయంలో 25 కుక్కలను తుపాకీతో కాల్చి చంపారు. భూత్పూర్ సీఐ రామకృష్ణ ఛాలెంజింగ్‌గా తీసుకొని ఆ కేసును ఛేదించి నిందితులను కటకటాల్లోకి పంపించారు. మళ్లీ అదే రీతిలో ఒకేసారి 15 కుక్కలను చంపి జాతీయ రహదారి పక్కన పడేసిన ఘటన కలకలం రేపుతున్నది.



మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన ధాన్యం

## ఆర్‌ఎన్‌ఆర్ @ రూ.2,480

జడ్చర్ల, మే 21 : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యానికి అత్యధికంగా క్వింటాకు రూ.2,480 ధర పలికింది. మంగళవారం మార్కెట్‌కు ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యంతోపాటు ఆముదాలు, మొక్కజొన్న అమ్మకానికి రాగా ఆర్‌ఎన్‌ఆర్ రకానికి గరిష్ఠంగా క్వింటాకు రూ.2,480, కనిష్ఠంగా రూ.1,909, మధ్యస్తంగా రూ.2,169 ధర పలికింది. మొక్కజొన్నకు క్వింటాకు రూ.2,278, ఆముదాలు క్వింటాకు గరిష్ఠంగా రూ.5,540 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.



పెద్దాపూర్ గోదాంలో చోరీ అనంతరం మిగిలిన వడ్ల బస్తాల నిల్వలు (ఫైల్)

- స్థలం కొరతతో పెద్దాపూర్ గోదాంలో వడ్ల బస్తాల నిల్వ
- గోదాంకు మార్కెటింగ్ శాఖ అధికారుల తాళం
- రెండు నెలల కిందట వెళ్లి చెక్ చేసుకున్న వ్యాపారి
- 13 వేల బస్తాలు చోరీ జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు
- 2,400 బ్యాగులు మాత్రమే రికవరీ చేసిన రక్షకభటులు
- మిగిలిన పది వేల బస్తాలేవీ?
- బడాబాబుల హస్తం ఉన్నట్లు అనుమానిస్తున్న మిల్లర్లు

# ధాన్యం జాడేదీ?

## కేసీఆర్ సర్కారు కేటాయించిన సీఎంఆర్ వడ్లు మాయం!

కల్వకుర్తి, మే 21 : ఎంజీకేఎల్‌ఐ పథకం కింద 2017 నుంచి సాగునీరు పుష్కలంగా అందుతుండగా కల్వకుర్తి ప్రాంతంలో రైతులు ఎక్కువ మొత్తంలో వరి సాగుచేశారు. 2020 నుంచి వరి సాగు ఊహించనంతగా పెరిగింది. దీంతో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి నేరుగా సేకరించింది. మద్దతు ధర కూడా మంచిగా వస్తుండడంతో రైతులెవరూ ప్రైవేట్ వ్యాపారస్తులను ఆశ్రయించలేదు. ఈ క్రమంలో ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని బియ్యంగా మార్చేందుకు (సీఎంఆర్) అర్హులైన రైస్‌మిల్లు యజమానులకు ఎంపిక చేసి వారికి అప్పగించింది. మార్కెట్లోకి ధాన్యం ఎక్కువగా రావడంతో వ్యాపారులు ఎక్కడ వీలైతే అక్కడ జిన్నింగ్ మిల్లులు, ఫంక్షన్‌హాల్‌లు, గోదాంలలో నిల్వ ఉంచారు. అయితే, ఏటా ధాన్యం దిగుబడి అధికంగా రావడంతో దూరంగా ఉన్న గోదాంలలో నిల్వ ఉంచిన వడ్ల బస్తాలు అలాగే మిగులుతున్నాయి. కోటా ప్రకారం బియ్యాన్ని ప్రభుత్వానికి ఇస్తూ వస్తున్నారు.

కేసీఆర్ ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన వడ్లను బియ్యంగా మార్చి ఇవ్వాలని (సీఎంఆర్) 2022 యాసంగి సీజన్‌లో కల్వకుర్తి పట్టణానికి చెందిన వ్యాపారి రమేశ్‌బాబుకు కేటాయించింది. పారాబాయిల్డ్ మిల్లు ఉన్న రమేశ్‌బాబుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున వడ్లను అప్పజెప్పిన నేపథ్యంలో వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామ సమీపంలో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోదాంను అద్దెకు తీసుకుని ధాన్యాపు బస్తాలను నిల్వ చేశాడు. నిల్వలు ఎక్కువగా ఉండడం, కొత్తగా వడ్లు వస్తుండడంతో సదరు వ్యాపారి పెద్దాపూర్ గోదాం వైపు దృష్టి సారించలేదు. గోదాంలో నిల్వ ఉంచిన 2022 యాసంగి వడ్లను 2023 యాసంగి వడ్ల నిల్వగా అధికారులకు రికార్డు ఇచ్చాడు. తన వద్ద ఉన్న నిల్వలు తగ్గగానే.. వడ్లను బియ్యంగా మార్చి ప్రభుత్వానికి ఇవ్వాలని భావించాడు. అయితే, పెద్దాపూర్ గోదాం నుంచి ధాన్యం బస్తాలను తీసుకెళ్లేందుకు వ్యాపారికి అద్దె చెల్లింపు అడ్డంకిగా మారింది. మార్కెటింగ్ శాఖ నిర్మించిన గోదాంలో నిల్వ ఉంచిన ధాన్యానికి అద్దె చెల్లించాల్సిన అవసరం లేదని.. అప్పటి ప్రభుత్వం మౌఖికంగా ప్రకటన చేసింది. దీంతో వ్యాపారి కిరాయి ఇవ్వలేదు. మార్కెట్ అధికారులు మాత్రం అద్దె చెల్లించాలని వ్యాపారికి నోటీసులు జారీ చేశారు. అద్దె అవసరం లేదని తెలిపిన జీవో కాపీ ఇవ్వాలి.. లేదా అద్దె చెల్లించాలని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు డిమాండ్ చేస్తూ గోదాంకు తాళం బిగించారు. ఈ ఏడాది మార్చి మొదటి వారంలో వనపర్తి, అచ్చంపేట, కొల్లాపూర్‌లో వడ్ల బస్తాలు చోరీ అయ్యాయని వార్తలు రావడంతో సదరు వ్యాపారి మార్కెటింగ్ శాఖ అధికారులకు సమాచారమిచ్చాడు. రెండు, మూడు రోజుల తర్వాత తానే నేరుగా గోదాం వద్దకు వెళ్లగా.. తాళాలు తీసి ఉన్నట్లు గమనించి వెంటనే వెల్దండ పోలీసులకు విషయాన్ని వివరించాడు. సుమారు 13 వేల బస్తాలు చోరీ అయ్యాయని సదరు వ్యాపారి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకొని వేగంగా దర్యాప్తు చేపట్టారు. దుండగులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. చోరీ చేసిన బస్తాలను నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోకి ఓ బడా వ్యాపారికి విక్రయించినట్లు ఒప్పుకొన్నారు. ఇందులో ట్విస్ట్ ఏమిటంటే.. 3 వేల బస్తాలు మాత్రమే కొనుగోలు చేశామని బడా వ్యాపారి అంగీకరించినట్లు సమాచారం. పోలీసులు మాత్రం 2,400 బస్తాలు చోరీ అయ్యాయని కేసు నమోదు చేశారు. మరి మిగతా పది వేల బస్తాలు ఎక్కడికి వెళ్లాయన్నదే శేషప్రశ్నగా మిగిలింది. పెద్దాపూర్ గోదాంలో వడ్ల సంచులు నిల్వ వేసినప్పటి నుంచి అక్కడికి ఎప్పుడూ వెళ్లలేదని, మార్కెటింగ్ శాఖ అధికారులే గోదాంకు తాళం వేశారని రమేశ్‌బాబు తెలిపారు. ఇందులో ఏదో పెద్ద కుట్ర దాగి ఉందని అనుమానం వ్యక్తం చేశాడు. గోదాంకు తాళాలు బిగించి ఉండటం, అటు వైపు ఎవ్వరూ రాకపోవడం, డిసెంబర్, జనవరి మాసాల్లో చలి ఎక్కువగా ఉండడాన్ని దుండగులు తమకు అనుకూలంగా మార్చుకున్నారని పెద్దాపూర్ గ్రామస్తులు అనుమానిస్తున్నారు. గోదాం పక్కవైపు ఉన్న షెల్టర్ల నుంచి వడ్ల బస్తాలు తీస్తే ఎవ్వరికీ డౌట్ రాదనే ఉద్దేశంతో దుండగులు వడ్ల బస్తాలు ఎత్తుకెళ్లి ఉండొచ్చు. చోరీ ఘటనలో పెద్ద తలకాయాలు ఉండొచ్చనే అనుమానాలను రైస్ మిల్లర్లు వ్యక్తం చేస్తున్నారు. వడ్లు నిల్వ ఉంచిన సంచుల మీద సివిల్ సప్లై పేరు, గుర్తు ఉంటుందని.. అటువంటి బస్తాలను కొనుగోలు చేయడం చూస్తే ప్రణాళికా ప్రకారం చోరీ చేశారని చెబుతున్నారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి 10 వేల బస్తాల వడ్లను రికవరీ చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు. బాధితుడు మాత్రం న్యాయం చేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు.



హన్వాడ మండలకేంద్రంలో మహిళలు చెయ్యెత్తినా ఆపకుండా వెళ్తున్న బస్సు

# మహాలక్ష్మి అవస్థలు

- స్టాప్ వద్ద మహిళలను చూసి బస్సులు నిలపని డ్రైవర్లు
- దూరంగా ఆపడంతో ఆడపడుచుల పరుగులు
- గంటల తరబడి తప్పని నిరీక్షణ

హన్వాడ, మే 21 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహాలక్ష్మి పేరిట ప్రవేశపెట్టిన 'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం' అవస్థలు తెచ్చిపెడుతున్నది. చెయ్యెత్తిన చోట బస్సులు ఆపాలన్న నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. నిత్యం ఎక్కడో ఒక చోట కొట్లాటలు, మహిళల నుంచి నిరసనలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. బస్టాప్ వద్ద కాకుండా మరో దగ్గర బస్సులు ఆపుతుండడంతో మహిళలు పరుగులు పెడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. హన్వాడ మండలకేంద్రంలో ఉదయం 9 గంటల సమయంలో వివిధ గ్రామాల నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు దాదాపుగా 25 మంది మహిళలు బస్టాప్‌కు చేరుకున్నారు. నాలుగు బస్సులు రాగా.. మహిళలు చెయ్యెత్తినా రెండు ఆపకుండా వెళ్లాయి. మహిళలు ఉండడంతో మరో రెండు బస్సుల డ్రైవర్లు స్టాప్ వద్ద కాకుండా దూరంగా ఆపారు. దీంతో మహిళలు బస్సు ఆపిన చోటు వరకు పరుగులు పెట్టారు. 1:30 గంటలు గడిచినా ఒక్క బస్సు కూడా ఆపడం లేదని, తమను చూసి దూరంగా నిలుపుతున్నారని మహిళలు ఆరోపించారు. దీంతో విసుగు చెందిన ఆడపడుచులు రోడ్డుపైకి బస్సుకు అడ్డంగా వెళ్లారు. బస్సులు ఆపకపోతే గమ్యానికి చేరుకునేదెలా అని ప్రశ్నిస్తున్నారు. బస్సులు నిలపని డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.



స్టాప్‌నకు దూరంగా బస్సు ఆపడంతో పరుగులు పెడుతున్న మహిళలు

## పీయూ ఇన్‌చార్జి వీసీగా నదీమ్ అహ్మద్



నదీమ్ అహ్మద్

మహబూబ్‌నగర్ అర్బన్, మే 21 : పాలమూరు విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ లక్ష్మీకాంత్‌రాథోడ్ మే 21 నాటికి గడువు ముగిసింది. దీంతో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ప్లానింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ నదీమ్‌అహ్మద్ (ఐఏఎస్)ను ఇన్‌చార్జి వీసీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇక నుంచి ఆయన మార్గదర్శకంలోనే యూనివర్సిటీ నడవనున్నట్లు పీయూ అధికారులు తెలిపారు.

## చిరుత బారి నుంచి తప్పించుకున్న ఆర్‌ఎంపీ

ఖిల్లాఘణపురం, మే 21 : చిరుత బారి నుంచి ఆర్‌ఎంపీ రామానాయుడు తృటిలో తప్పించుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. వనపర్తికి చెందిన రామానాయుడు ఖిల్లా మండలంలోని మామిడిమాడలో ఆర్‌ఎంపీగా పనిచేస్తున్నాడు. కాగా, సోమవారం రాత్రి పని ముగించుకొని వనపర్తికి వెళ్తుండగా బలిజపల్లి-కర్నెతండా రోడ్డుపై అకస్మాత్తుగా చిరుత ఎదురైంది. దీంతో భయంతో తన బైక్‌ను వేగంగా నడిపాడు. మార్గమధ్యంలో కర్నెతండాకు వెళ్తున్న వారికి చెప్పడంతో వెనుదిరిగారు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి చిరుతను బంధించాలని కోరుతున్నారు.



గద్వాల మార్కెట్‌యార్డులో నేలకొరిగిన మహావృక్షం

# గాలివాన బీభత్సం

- విరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- నేలరాలిన మామిడి కాయలు
- గట్టులో పిడుగుపాటుకు ఎద్దు మృతి
- జమ్మిచేడులో వడగండ్ల వాన

గద్వాల అర్బన్/కోడేరు/అయిజ/గట్టు, మే 21 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. గద్వాల మండలం జమ్మిచేడులో ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. ఈదురుగాలుల ధాటికి పలుచోట్ల పెద్ద చెట్లు నేలకొరిగాయి. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని మార్కెట్‌యార్డులో 50 ఏండ్ల నాటి వేపచెట్టు నేలకొరిగింది. అనంతపురం పెట్రోల్‌బంక్ వద్ద ఉన్న చెట్టు రోడ్డుకు అడ్డంగా పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్సై పర్వతాలు ఘటనాస్థలికి చేరుకొని చెట్టును తొలగించారు. కోడేరు మండలంలోని నాగులపల్లితండాలో ఈదురుగాలులతో చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కోడేరు, జనుంపల్లి, ఎత్తం, నర్సాయపల్లి, నాగులపల్లి, మైలారం, కొండ్రావుపల్లి గ్రామాల్లో మామిడికాయలు నేలరాలాయి. దీంతో మామిడి రైతులు రూ.లక్షల్లో నష్టపోయారు. చాలా గ్రామాల్లో మామిడి చెట్లు విరిగిపడ్డాయి. కొల్లాపూర్‌కు చెందిన కౌలు రైతు ఏకంగా కన్నీటిపర్యంతమయ్యారు. ఒక్క తోటకు రూ.4 లక్షల వరకు యజమానికి చెల్లించానని.. తీరా చూస్తే గాలి వానకు కాయలు నేలరాలడంతో నష్టం జరిగిందన్నారు. ఉద్యానవన శాఖ అధికారులు పరిశీలన చేసి ఆదుకోవాలని కోరుతున్నారు. అయిజ మండలంలోని పలు గ్రామాల్లో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అయిజ పట్టణంలోని పలు వీధుల్లో వర్షపు నీరు నిలిచింది. చెట్లు నేలకొరిగాయి. పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు కూలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

గట్టు మండలంలోని బోయలగూడెం శివారులో పిడుగుపాటుకు కోలంట్ల తిమ్మన్నకు చెందిన ఎద్దు మృతి చెందింది. రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు.



నాగులపల్లితండాలో విరిగిన వేపచెట్టు, విద్యుత్ స్తంభం



గట్టు : మృతి చెందిన ఎద్దు వద్ద రోదిస్తున్న వృద్ధురాలు